క్లుప్తంగా

నేడు సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా

వీరఘట్టం: స్థానిక మేజర్ పంచాయతీ కార్యాలయం ఎదుట గురువారం ఉదయం 10 గంటలకు ధర్నా నిర్వహించనున్నట్లు సీపీఎం నాయకులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వీరఘట్టం మేజర్ పంచాయతీలో పారిశుధ్యం క్షీణించిందని.. ప్రజలకు తాగునీరు సరిపడా సరఫరా కావడం లేదని.. జల్‌జీవన్ మిషన్‌లో భాగంగా తాగునీటి కుళాయిలు వేయలేదని ఆరోపించారు. సమస్యలను పరిష్కరించాలని కోరుతూ చేపట్టనున్న ధర్నాలో ప్రజలందరూ స్వచ్ఛందంగా పాల్గొనాలని కోరారు.

పన్ను చెల్లించి రాయితీ పొందండి



పాలకొండ: నగర పంచాయతీలోని ప్రజలు ఈ నెల 31లోగా ఆస్తి పన్ను చెల్లిస్తే వడ్డీలో 50 శాతం రాయితీ వర్తిస్తుందని కమిషనర్ జయరామ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంతవరకు పన్ను మొత్తం ఒకేసారి చెల్లించిన వారికి మాత్రమే ఈ రాయితీ వర్తించేదని పేర్కొన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అలాగే నీటి, కుళాయి, ఖాళీ స్థలాల పన్నులను చెల్లించాలని కోరారు.

సారా విక్రయాలను నిరోధించాలి



మాట్లాడుతున్న ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ జైభీమ్

సీతంపేట: సారా విక్రయాలను నిరోధించాలని రాజాం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఆర్. జైభీమ్ అన్నారు. స్థానిక గ్రామ సచివాలయంతో పాటు అడ్డాకులగూడలో నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా బుధవారం అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సారా తాగడం వలన వచ్చే అనర్థాలను వివరించారు. సారా తయారు చేసినా, విక్రయించినా చట్ట ప్రకారం తీసుకునే చర్యలపై అవగాహన కల్పించారు. సారాకు సంబంధించి ఎటువంటి సమాచారం తెలిసినా టోల్‌ఫ్రీ నంబర్ 14405కు తెలియజేయాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కుండంగి సరస్వతి, సర్పంచ్ ఆరిక కళావతి, గ్రామకార్యదర్శి రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

వచ్చే నెల 13న గురుకుల ప్రవేశ పరీక్ష

భామిని: సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో 5వ తరగతి, ప్రథమ ఇంటర్‌లో ప్రవేశాలకు ఏప్రిల్13న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు గురుకులం ప్రిన్స్‌పాల్ ఎం.విజయనిర్మల బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వాస్తవానికి ఏప్రిల్ ఆరున ప్రవేశ పరీక్ష నిర్వహించాల్సి ఉండగా.. కొన్ని కారణాల వల్ల పరీక్ష తేదీని మార్చినట్లు పేర్కొన్నారు. మార్పును విద్యార్థులు గమనించాలని కోరారు.

సంత వేలంపాట ఖరారు



వేలంపాట నిర్వహిస్తున్న అధికారులు

సీతంపేట: మండల కేంద్రంలోని వారపు సంత నిర్వహణకు బుధవారం వేలంపాట నిర్వహించారు. హిమరిక సంగమేషు రూ. 7.50 లక్షలకు పాట దక్కించుకున్నారు. రోజువారీ ఆశీల వేలంపాట తుండక లక్ష్మయ్యకు 83,500 రూపాయలకు ఖరారైంది. కార్యక్రమంలో సర్పంచ్ ఆరిక కళావతి, ఎంపీటీసీ సభ్యురాలు పగడాలమ్మ, డీఎల్‌పీఓ జె.రాంప్రసాద్, పంచాయతీ కార్యదర్శి బి.రామకృష్ణ, వార్డు మెంబర్లు, తదితరులు పాల్గొన్నారు.

నవోదయకు ఎంపిక



దూసి స్నేహలత

వీరఘట్టం: మండలంలోని కొట్టుగుమ్మడ పాఠశాలలో చదువుతున్న దూసి స్నేహలత జవహర్ నవోదయ ప్రవేశ పరీక్షలో సత్తా చాటింది. మంగళవారం విడుదలైన ఫలితాల్లో స్నేహలత ఎంపికైనట్లు పాఠశాల ఉపాధ్యాయులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు బాలికను ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

మద్యం మత్తులో అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తికి దేహశుద్ధి

పార్వతీపురం రూరల్: జిల్లా కేంద్రానికి సమీపంలో మండల పరిధిలో ఉన్న ఓ ప్రైవేట్ పాఠశాల సమీపంలో సాయంత్రం పాఠశాల విడిచి పెట్టే సమయంలో ఓ వ్యక్తి మద్యం మత్తులో అటుగా వెళ్తున్న విద్యార్థులను అసభ్యకరంగా మాట్లాడుతూ, వెకిలి చేష్టలు చేయడంతో గుర్తించిన స్థానికులు దేహశుద్ధి చేశారు. ఈ మేరకు సమీపంలో ఉన్న ఏఐఎస్‌ఎఫ్ కార్యదర్శి రవికుమార్ పార్వతీపురం రూరల్ ఎస్సై బి.సంతోషికి ఫోన్ ద్వారా సమాచారం ఇవ్వడంతో రూరల్ పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని ఆ వ్యక్తిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు.

ఏరియా ఆస్పత్రిలో..

వైద్య సిబ్బంది కొరత



సీతంపేట ఏరియా ఆస్పత్రి

- 96 మందికి గాను పని చేస్తున్నది 64 మందే..
- వివిధ విభాగాల్లో 32 పోస్టులు ఖాళీ
- రోజుకు సరాసరిన 300 ఓపీ
- రోగులకు తప్పని ఇబ్బందులు

సీతంపేట: మండల కేంద్రంలోని ఏరియా ఆస్పత్రిలో సరిపడా వైద్య సిబ్బంది లేకపోవడంతో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందడం లేదు. సీతంపేట ఏజెన్సీతో పాటు భామిని, కొత్తూరు, పాలకొండ పరిసర ప్రాంత వాసులు ఇక్కడకే వచ్చి వైద్యసేవలు పొందుతుంటారు. ఇక్కడే డెలివరీలు, ఫ్యామిలీ ప్లానింగ్ ఆపరేషన్లు వంటివి కూడా అత్యధికంగా జరుగుతుంటాయి. ఇతర పీహెచ్‌సీల నుంచి రిఫరల్ కేసులు కూడా ఇక్కడకే వస్తుంటాయి. ఆస్పత్రిలో అన్ని సౌకర్యాలున్నా వైద్య సిబ్బంది కొరత మాత్రం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. మొత్తం వివిధ విబాగాల్లో 96 మంది వైద్యసిబ్బంది పని



రోగులకు వైద్యసేవలందిస్తున్న వైద్యుడు

చేయాల్సి ఉన్నప్పటకీ 64 మంది మాత్రమే పనిచేస్తున్నారు. 32 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ప్రధానంగా ఆరు వైద్యాధికారి పోస్టులు ఖాళీగా ఉన్నాయి. దీనిలో ఎన్‌ఆర్‌సీ, ఎన్‌సీడీ వైద్యాధికారి పోస్టులు కూడా ఖాళీగానే ఉన్నాయి. ఫిజియోథెరపిస్ట్, ఆస్పత్రి పరిపాలనాధికారి, సీఎస్‌ఎస్ మత్తు డాక్టర్, సీఎఎస్ డెర్మటాలజిస్టు, ఆర్‌ఎంఓ వంటి పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అలాగే ఏడు స్టాఫ్‌నర్స్ పోస్టులు, ఫార్మసిస్ట్ గ్రేడ్ వన్, డార్క్‌రూమ్ అసిస్టెంట్, ఆడియో మెట్రీషియన్ పోస్టులు ఖాళీగా ఉండడంతో రోగులకు మెరుగైన వైద్యసేవలు అందడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

రోగుల తాకిడి..

ఆస్పత్రికి రోగుల తాకిడి రోజురోజుకూ పెరుగుతోంది. రోజుకు సరాసరి 300 వరకు అవుట్ పేషెంట్ రోగులు వస్తుంటారు. వేసవి సీజన్ కావడంతో గతంతో పోలిస్తే ఇప్పుడు ఓపీ పెరిగిందని వైద్యనిపుణులు చెబుతున్నారు. ఆశ్రమ పాఠశాలలు, గురుకులాలు, కేజీబీవీలు, మినీ గురుకులాలు, పోస్ట్‌మెట్రిక్ వసతిగృహాల విద్యార్థులకు ఇక్కడే వైద్యసేవలు అందుతాయి. ఆస్పత్రికి రూ. 20 కోట్లతో అదనపు భవనాల నిర్మాణాలు జరుగుతున్నాయి. వీటిని కొన్నేళ్లుగా నిర్మిస్తూనే ఉన్నారు. ఇప్పటికీ పూర్తి కాలేదు. త్వరలోనే పూర్తి అయితే సమస్య కొంతమేర తొలగిపోతుందని వైద్యసిబ్బంది చెబుతున్నారు. ఎక్స్‌రే ప్లాంట్, డయాలిసిస్ గది, బ్లడ్‌బ్యాంక్, రక్తపరీక్షల గదులు, ఆపరేషన్ థియేటర్ వంటివి ఈ కొత్త గదుల్లో ఏర్పాటు చేయనున్నారు. అలాగే ఒక్కో వైద్య విభాగానికి ఒక్కో గదిని కేటాయించనున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి..



ఏరియా ఆస్పత్రిలో ఖాళీగా ఉన్న పోస్టుల విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లడం జరిగింది. త్వరలోనే ఈ పోస్టులు భర్తీ అవుతాయని ఆశిస్తున్నాం. ఉన్న డాక్టర్లతోనే రోగులకు వైద్యసేవలు అందిస్తున్నాం. మందుల కొరత లేదు. సక్రమంగా వైద్యసేవలందిస్తున్నాం. – బి.శ్రీనివాసరావు, ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్



ఆస్పత్రిలో ఇన్‌పేషెంట్లు

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి : ఈఈ



కొమరాడలో ఇళ్ల నిర్మాణాలు పరిశీలిస్తున్న ఈఈ

కొమరాడ: ప్రభుత్వం నుంచి మంజూరైన ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని గృహ నిర్మాణ శాఖ ఈఈ జి.సోమేశ్వరరావు అన్నారు. మండల కేంద్రంలో ఆయన బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన నిర్మాణంలో ఉన్న ఇళ్లను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాలో పీఎంఏవై గ్రామీణ పథకాలకు రూ.1.80లక్షల యూనిట్ విలువతో పీఎం జన్‌మన్ పథకానికి రూ.2.39 లక్షల యూనిట్ విలువతో గత ప్రభుత్వ హయాంలో ఇళ్లు మంజూరయ్యాయని చెప్పారు. వీటిలో సగానికి పైగా ఇళ్లు పూర్తయ్యాయన్నారు. మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయని తెలిపారు. వీలైనంత త్వరగా వీటిని పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల లబ్ధిదారులకు అదనపు సాయం చేస్తుందని, వినియోగించుకోవాలని సూచించారు. మే 31లోగా పూర్తి చేయడానికి లబ్ధిదారులకు కావాల్సిన సాయం అందజేస్తామని తెలిపారు. ఆయన వెంట గృహ నిర్మాణ శాఖ ఏఈ డి.రాములు, నారాయణరావు తదితరులు ఉన్నారు.

సక్రమంగా రీ సర్వే



సిబ్బందికి సూచనలు అందిస్తున్న సబ్ కలెక్టర్ యశ్వంత్‌కుమార్ రెడ్డి

పాలకొండ: భూముల రీ సర్వే సక్రమంగా పూర్తి చేయాలని సబ్ కలెక్టర్ యశ్వంత్‌కుమార్ రెడ్డి తెలిపారు. మండలంలోని తంపటాపల్లిలో జరుగుతున్న రీ సర్వేను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రీ సర్వే రికార్డులు పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం సచివాలయాన్ని సందర్శించి రెవెన్యూ సమస్యలపై ఆరా తీశారు. ఆయనతో పాటు తహసీల్దార్ బాల మురళీకృష్ణ, రీసర్వే డీటీ సన్యాసిరావు, ఆర్ఐ బాబూరావు ఉన్నారు.

రుణాలతో యువతకు ఉపాధి



ఇంటర్వ్యూలో పాల్గొన్న అధికారులు, అభ్యర్థులు

గరుగుబిల్లి: యువతకు ఉపాధిని కల్పించేందుకు బీసీ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ రుణాలను మంజూరు చేయడం జరుగుతుందని ఎంపీడీఓ జి.పైడితల్లి పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో రుణాల కోసం దరఖాస్తు చేసుకొన్న అభ్యర్థుల ధ్రువీకరణ పత్రాలను బ్యాంక్ సిబ్బందితో కలిసి పరిశీలించారు. మండలానికి 108 యూనిట్లు మంజూరుకాగా 434మంది దరఖాస్తు చేసుకున్నారన్నారు. ఈ ఇంటర్వ్యూలలో గరుగుబిల్లి, తోటపల్లి ఏపీ గ్రామీణ వికాస్ బ్యాంక్, గరుగుబిల్లి స్టేట్ బ్యాంక్, రావివలసలోని యూనియన్ బ్యాంక్ అధికారులు పాల్గొని ఇంటర్వ్యూలు నిర్వహించి, ధ్రువీకరణలు పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీపీ ఉరిటి రామారావు, ఈఓపీఆర్‌డీ ఎల్.గోపాలరావు, బ్యాంకు సిబ్బంది వీవీ ఆర్‌రెడ్డి, సంతోషకుమార్ తదితరులున్నారు.

ముగిసిన శిక్షణ తరగతులు

గుమ్మలక్ష్మీపురం (కురుపాం): కురుపాం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద అంగన్‌వాడీ కార్యకర్తలకు ఈ నెల 24 నుంచి నిర్వహించిన పోషణ్ బీ పడాయి బీ శిక్షణ తరగతులు బుధవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా కురుపాం సీడీపీఓ కె.విజయగౌరీ శిక్షణ పొందిన కార్యకర్తలతో మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు సంపూర్ణ పోషకాహారం అందివ్వడం, ప్రీ స్కూల్ పిల్లలకు ప్రాథమిక విద్యపై పట్టు సాధించేలా మేధా శక్తి పెంచడమే లక్ష్యంగా పోషన్ బీ పడాయి బీ శిక్షణ కార్యక్రమం నిర్వహించినట్టు తెలిపారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు భవాని, జానకి, గౌరి, శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

నేడు ఇంటర్వ్యూలు

వీరఘట్టం: సబ్సిడీ రుణాలకు దరఖాస్తు చేసుకున్నవారికి గురువారం ఉదయం 10.30 గంటలకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బ్యాంక్ అధికారుల సమక్షంలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ బి.వెంకటరమణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారంతా పూర్తి వివరాలతో కార్యాలయంలో జరిగే ఇంటర్వ్యూలకు హాజరు కావాలని కోరారు.

పక్కదారి పట్టిన పంచాయతీ నిధులు!

కొమరాడ: మండలంలో పంచాయతీ నిధులు దుర్వినియోగమైనట్టు పలు పత్రికల్లో వార్తలు రావడంతో పాటు ఆరోపణలు వెల్లువెత్తుతున్న తరుణంలో దర్యాప్తు చేయరా? అంటూ స్థానికులు చర్చించుకుంటున్నారు. మండల పరిషత్ కార్యాలయంలో పని చేస్తున్న ఓ వ్యక్తి ఖాతాలోకి నిధులు పలు పంచాయతీల నుంచి జమైనట్టు పబ్లిక్ వెబ్‌సైట్‌లో చూపిస్తుందని అయినా అధికారులు పట్టించుకోకపోవడమేంటని పలువురు ప్రశ్నిస్తున్నారు. గిరిజన పంచాయతీల నిధులు దుర్వినియోగం అయినట్టు విమర్శలున్నాయి. దీనిపై దర్యాప్తు చేసి నిజాలు రాబట్టాలని పలువురు కోరుతున్నారు.

ప్రకృతి సాగుతో అధిక దిగుబడులు



రైతులతో మాట్లాడుతున్న ఎన్‌పీఎం సిబ్బంది

భామిని: జీడిమామిడిలో ప్రకృతి సాగు విధానం అవలంభిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని ఉద్యానవన శాఖాధికారి పేడాడ రాజశ్రీ అన్నారు. మండలంలోని తాలాడలో బుధవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడుతూ.. ప్రకృతి సాగులో భాగంగా పంచగవ్య వినియోగిస్తే దిగుబడి బాగా పెరుగుతుందని చెప్పారు. ప్రకృతి సాగు ఐటీడీఏ ఎన్ఎఫ్ఏ వై. ముసలయ్య మాట్లాడుతూ.. పశువుల మలమూత్రాలతో తయారు చేసే కషాయాలు, అస్త్రాలను వినియోగించాలని సూచించారు. చీడపీడల నివారణకు నీమాస్త్రం, బ్రహ్మాస్త్రం, అగ్నాస్త్రం ఎంత ఉపయోగపడతాయని చెప్పారు.కార్యక్రమంలో సిబ్బంది అంబోజీ, దేవీప్రసాద్, ధర్మారావు, వి.ప్రసాద్ కె.శ్రీలక్ష్మి, జీడి రైతులు పాల్గొన్నారు.

● అగ్ని ప్రమాదాలపై అవగాహన



వీరఘట్టం మండలంలోని గంగమ్మపేట గిరిజన ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు పాలకొండ ఫైర్ ఆఫీసర్ జామి సర్వేశ్వరరావు అగ్ని ప్రమాదాలపై బుధవారం అవగాహన కల్పించారు. అగ్ని ప్రమాదాలు సంభవించేటప్పుడు మంటలను ఏ విధంగా అదుపు చేయాలి.. గ్యాస్ సిలిండర్లకు నిప్పు అంటుకుంటే ఆ గ్యాస్ మంటను ఎలా నియంత్రించాలి.. మంటల్లో చిక్కుకున్న వారిని ఎలా రక్షించాలో వివరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం బి.భాస్కరరావు, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు, ఫైర్ సిబ్బంది పాల్గొన్నారు. –వీరఘట్టం

● క్రీడలతో మానసిక ఉల్లాసం



క్రీడలు మానసిక ఉల్లాసంతో పాటు పోటీతత్వాన్ని అలవర్చుతాయని పాలకొండ డీఎస్పీ బి.రాంబాబు అన్నారు. కురుపాం మండలంలోని నీలకంఠాపురం పోలీసుల ఆధ్వర్యంలో ధర్మలక్ష్మీపురం క్రీడా మైదానంలో బుధవారం నిర్వహించిన మెగా క్రికెట్ టోర్నమెంట్‌ను డీఎస్పీ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన క్రీడాకారులతో మాట్లాడారు. సీఐ బి.హరి, ఎస్ఐలు ఎ.నీలకంఠరావు, పి.నారాయణరావు, బి.శివప్రసాద్, ట్రైనీ ఎస్ఐలు పాల్గొన్నారు. – గుమ్మలక్ష్మీపురం (కురుపాం)

● ఫేర్‌వెల్ డే



సీతంపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఫేర్‌వెల్ డే ఫంక్షన్ బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ సుశాంత్ జనా మాట్లాడుతూ.. విద్యార్థులు డిగ్రీ తర్వాత వివిధ కాంపిటేషన్ పరీక్షలు రాసి మంచి ఉద్యోగాల్లో స్థిరపడాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన నృత్యాలు పలువురిని ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ప్రభాకరరావు, అధ్యాపకులు ఎం.రవికిరణ్‌కుమార్, ఎం.ఫణికుమార్, బి.మంజుల, లలితకుమారి, విజయలక్ష్మి, శంకరరావు, రామకృష్ణ, యూబీ రాజు, తదితరులు పాల్గొన్నారు. – సీతంపేట

సుస్థిర అభివృద్ధికి సహకరించాలి



కార్యక్రమంలో పాల్గొన్న సౌత్ ఆసియా రైస్ ఫారెస్టు అలియన్సు సర్టిఫికేషన్ పీఎం నీల్‌కాంత్

గరుగుబిల్లి: ఏడాది పొడవునా పంటలు పండించుకుని సుస్థిర అభివృద్ధి సాధించేందుకు రైతులంతా సహకరించాలని సౌత్ ఆసియా రైస్ ఫారెస్టు అలియన్సు సర్టిఫికేషన్ ప్రాజెక్టు మేనేజర్ నీల్‌కాంత్ పేర్కొన్నారు. మండలంలోని తోటపల్లి జట్టు ట్రస్టు కార్యాలయంలో మామిడి, జీడి, పసుపు పంటలకు రైన్ ఫారెస్టు అలియన్స్ సర్టిఫికేషన్ చేయు విధానంపై బుధవారం నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో గుమ్మలక్ష్మీపురం మండలంలో జీవ ప్రాజెక్టు పరిధిలో 28 గ్రామాలలో ఉన్న ఆదితల్లి రైతు ఉత్పత్తిదారుల కంపెనీ రైతులు పండించే పంటలు ప్రపంచ వ్యాప్తంగా మార్కెటింగ్ చేసుకొనేందుకు అనువుగా రైన్ ఫారెస్టు అలియన్స్ ధ్రువీకరణకు ఎఫ్‌పీఓ ద్వారా చేపట్టే అవకాశం రావడం రైతులకు ఎంతో శుభపరిణామమన్నారు. స్కూల్ సిలబస్ డవలప్‌మెంట్ సీనియర్ కన్సల్టెంట్ డి.పారినాయుడు, ప్రాజెక్టు అధికారి పి.వినూత్న, డీపీఎం పి.షణ్ముఖరాజు, సిబ్బంది నేపా, శ్రీధర్, రోజా చంద్, ఎస్.ప్రహరాజ్ పాల్గొన్నారు.

కంటైనర్ ఆసుపత్రుల ప్రారంభం



పెద్దగూడ గ్రామంలో కంటైనర్ ఆసుపత్రిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని తాడికొండ పీహెచ్‌సీ పరిధి పెద్దగూడ గ్రామంలో.. కురుపాం మండలంలోని మొండెంఖల్లు పీహెచ్‌సీ పరిధిలోని పోరండంగూడ గ్రామంలో.. కంటైనర్ ఆసుపత్రులను కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి బుధవారం ప్రారంభించారు. మారుమూల గిరిజన గ్రామాల ప్రజలకు వైద్య సేవలు చేరువ చేసేందుకు వీటిని ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి భాస్కరరావు, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ కెవిఎస్.పద్మావతి, వైద్యులు ఎం.బుద్ధేశ్వరరావు, అభిలాష్, ఎంపీడీఓలు ఎస్.సాల్మన్‌రాజు, జె.ఉమామహేశ్వరి, తహసీల్దార్ ఎన్.శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నియామక పత్రాల అందజేత



అంగన్‌వాడీ సహాయకులకు నియామక పత్రాలు అందజేస్తున్న సీడీపీఓ

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): కురుపాం ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని తిత్తిరి పంచాయతీ ఇప్పమానుగూడ, చింతమానుగూడ, తిత్తిపాయిగూడలతో పాటు ఏగులవాడ పంచాయతీ పెదవనజ, ఇప్పలగుడ్డి, వబ్బంగి పంచాయతీ సీరంగూడ, తియ్యాలిగూడ గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలకు అంగన్‌వాడీ సహాయకులుగా ఎంపికైన అభ్యర్థులకు కురుపాం సీడీపీఓ కె. విజయగౌరి బుధవారం తన కార్యాలయం వద్ద నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విధులను సక్రమంగా నిర్వర్తించాలని సూచించారు. కేంద్రాల అభివృద్ధికి కృషి చేయాలని కోరారు.

అగ్ని ప్రమాదాలపై తస్మాత్...



గుమ్మలక్ష్మీపురం జాతర వద్ద గ్యాస్ ప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

గుమ్మలక్ష్మీపురం: అగ్ని ప్రమాదాల పట్ల ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని గుమ్మలక్ష్మీపురం అగ్నిమాపక కేంద్రం సిబ్బంది ఎస్.తవిటినాయుడు, ఎన్.నాగరాజు, ఎం.తిరుపతిరావు, సీహెచ్ వైకుంఠరావు అన్నారు. గుమ్మలక్ష్మీపురంలో జరుగుతున్న జాతర ప్రదేశం వద్ద బుధవారం అగ్ని ప్రమాదాల పట్ల అప్రమత్తంగా వ్యవహరించాలంటూ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అగ్నిప్రమాదాలు జరిగే తీరు, అప్రమత్తంగా వ్యవహరించాల్సిన విధానం, గ్యాస్ ప్రమాదాల నివారణ చర్యల గూర్చి డెమో ప్రదర్శనల ద్వారా అవగాహన కల్పించారు.

సమస్యలు పరిష్కరించండి..



సమావేశంలో తీర్మానాలు చేస్తున్న కౌన్సిలర్లు

పాలకొండ: నగర పంచాయతీ పరిధిలోని సమస్యలను పరిష్కరించి ప్రజలకు మౌలిక వసతులు కల్పించాలని కౌన్సిల్ సభ్యులు కోరారు. బుధవారం స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో సాధారణ సమావేశాన్ని చైర్మన్ పల్లా ప్రతాప్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా అజెండాలోని సమస్యలపై సభ్యులు చర్చించారు. వెంకటరాయుని కోనేరు చేపల పెంపకానికి లీజుకు ఇచ్చే అంశాన్ని తొలగించాలని తీర్మానం చేశారు. ఈ చెరువును సుందరంగా తీర్చిదిద్దాలని సభ్యులు కోరారు. డంపింగ్ యార్డు సమస్య పరిష్కరించాలని సభ్యులు వెలమల మన్మధరావు, దుప్పాడ పాపినాయుడు, తదితరులు కోరారు. తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కడగల రమణ, తూముల లక్ష్మణరావు, నీలాపు శ్రీనివాసరావు కోరారు. సాధారణ నిధులతో అత్యవసర పనులు పూర్తి చేయాలని నిర్ణయించారు. వేసవి నేపథ్యంలో మూడు ప్రాంతాల్లో బోర్లు వేయాలని, చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని తీర్మానం చేశారు. సమావేశంలో కమిషనర్ జయరామ్, ఏఈ వరప్రసాద్, సిబ్బంది, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేరండి..



పదో తరగతి పాసైన విద్యార్థులు స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేరాలని అధ్యాపకులు కోరుతున్నారు. ఈ మేరకు మండల కేంద్రంలో బుధవారం ప్రచారం చేపడుతూ.. విద్యార్థులకు కరపత్రాలు అందజేశారు. ఏపీ మోడల్ స్కూల్, సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల పరీక్ష కేంద్రాల వద్ద పరీక్షలు రాసి వచ్చిన విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అందించే బోధన, సౌకర్యాలపై వివరించారు. - భామిని